ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

సోమవారం 9 డిసెంబరు 2024



నిధులివ్వండి అధ్యక్షా..!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



- నగరంలో మెట్రో రైల్, ఐటీ పార్కు విస్తరణ ఏమవుతుందో..?
- మడికొండలో వీవర్స్ పార్కు, ఘన్‌పూర్‌లో లెదర్‌పార్కుపై ఆశలు
- ములుగులో బిల్ట్ ఫ్యాక్టరీ, మేడారం అభివృద్ధికి ఆమోదం లభించేనా?
- భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీపై కార్మికుల్లో ఉత్కంఠ
- పాలకుర్తి-చెన్నూరు రిజర్వాయర్, జనగామలో పాలిటెక్నిక్ కాలేజీకి మోక్షం వచ్చేనా?
- దోర్నకల్‌లో వంతెనలు, జూనియర్, డిగ్రీ కాలేజీల మంజూరుకు డిమాండ్
- మహబూబాబాద్‌లో భూగర్భ డ్రైనేజీ, భారీ పరిశ్రమలపై ఆశలు
- పురోగతి లేకుండా పడి ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి..
- ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు గళం విప్పాలంటున్న ప్రజలు

7





రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత అంతటి ప్రాధాన్యమున్న ఓరుగల్లు అభివృద్ధి మరింత ముందుకు సాగాల్సి ఉంది. కాంగ్రెస్ యేడాది పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.10వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. ఏళ్ల తరబడి ఆగిపోయిన పనులకు మోక్షం కలిగినట్లు అయింది. అయినా ఇంకా కొన్ని పనులు పురోగతి లేకుండా పడి ఉన్నాయి. ఇవి పూర్తికావాలని స్థానిక ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఎన్నికల్లో సైతం నాయకులు స్థానిక అంశాలను ప్రచారంలో వినియోగించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు అవకాశమొచ్చింది. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు గళం విప్పాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా నగరంలో ప్రతిపాదనలో ఉన్న మెట్రో రైలు, ఐటీ పార్కు విస్తరణపై నగర పరిధి ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. అలాగే ములుగు జిల్లాలోని కమలాపురం బిల్ట్‌ఫ్యాక్టరీ, మేడారం అభివృద్ధి ప్రణాళికలపై స్పందించాలి. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, రోడ్లు, యూనివర్సిటీలపై సర్కారు దృష్టికి శాసన సభ్యులు తీసుకెళ్లాల్సి ఉంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అగమ్యగోచరం!

ఒకే భవనం... రెండు సంస్థలు

- ఆయుష్ ఆస్పత్రిలో నర్సింగ్ కాలేజీ
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఆయుష్ ఉన్నతాధికారులు
- తమ అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని అసహనం
- వైద్య ఆరోగ్య శాఖకు లేఖ రాసిన డైరెక్టర్
- అయోమయంలో నర్సింగ్ విద్యార్థులు

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లిలో ఆయుష్ ఆస్పత్రి భవన సముదాయంలో నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. తమ అనుమతి లేకుండా తమ ఆస్పత్రి భవనంలో నర్సింగ్ కాలేజీని ఎలా ఏర్పాటు చేస్తారని రాష్ట్ర ఆయుష్ విభాగం రచ్చకెక్కింది. దీంతో రెండు ప్రభుత్వ సంస్థల మధ్య వివాదం రాజుకుంది. దీంతో నర్సింగ్ కాలేజీలో అడ్మిషన్ పొందిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



భూపాలపల్లిలో ఒకే భవన సముదాయానికి పక్కపక్కన ఏర్పాటు చేసిన నర్సింగ్ కాలేజీ, ఆయుష్ ఆస్పత్రి బోర్డులు

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మూడు ఆయుష్ కాలేజీలను మంజూరు చేసింది. ఇందుకు రూ.45 కోట్లు కేటాయించింది. గత బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవతో జిల్లాకు ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటైంది. సిద్దిపేట, వికారాబాద్‌తో పాటు భూపాలపల్లికి రూ.15కోట్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.10కోట్లు 50పడకల ఆస్పత్రి నిర్మాణానికి, రూ.5కోట్లు ఆస్పత్రి ఫర్నిచర్‌కు కేటాయించింది. భూపాలపల్లిలోని రామప్పకాలనీ క్వార్టర్స్ సమీపంలో ఆస్పత్రి నిర్మాణం ఈ ఏడాది పూర్తయింది. ఆయుష్ శాఖ ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం ప్రారంభోత్సవ ఒక్కటే మిగిలి ఉంది.

ఇప్పటికే 45 నర్సింగ్ అడ్మిషన్లు

ఇదే జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం 60 సీట్లతో నర్సింగ్ కాలేజీని మంజూరు చేసింది. ఈఏడాది విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాలను ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించింది. దీంతో భూపాలపల్లిలోని మెడికల్ కాలేజీ పక్కన నిర్మాణం పూర్తయి ఉన్న ఆయుష్ ఆస్పత్రిలో నర్సింగ్ కాలేజీ తాత్కాలిక తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ భవనంలోనే హాస్టల్ కూడా ఏర్పాటు చేశారు. నర్సింగ్ కాలేజీకి కేటాయించిన 60 సీట్లల్లో ఇప్పటికే 45 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. త్వరలోనే క్లాసులు ప్రారంభం కానున్నాయి.

అధికారుల అభ్యంతరం

భూపాలపల్లి తమ ఆస్పత్రి భవనంలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటుపై ఆయుష్ విభాగం డైరెక్టర్ చిట్టెం లక్ష్మి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. దీంతో ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆయుష్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకుంటుంటే తమకు తెలియకుండా నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేయడం ఏమిటని లక్ష్మి ప్రశ్నించారు. త్వరలో సెంట్రల్ ఆయుష్ టీం ఈ ఆస్పత్రి నూతన భవనాలను పరిశీలించనుందని, ఈ నేపథ్యంలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయడంలో ఆంతర్యమిమిటో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. దీంతో వైద్యఆరోగ్య శాఖ అయోమయానికి గురైంది. ఏం చేయాలనే అంశంపై ప్రభుత్వంతో సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆదివారం జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రి ప్రారంభించాల్సిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార నర్సింహ పర్యటన వాయిదా పడినట్టు తెలుస్తోంది.

ఇంజనీరింగ్ అధికారుల తప్పిదాలు

ఆయుష్ ఆస్పత్రి నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం టీజీఎంఐడీసీకి అప్పగించింది. నిర్మాణ ఖర్చులను ఆయుష్ విభాగామే భరించింది. భవనం పూర్తయ్యాక టీజీఎంఐడీసీ అధికారులు ఆయుష్ విభాగానికి అప్పజెప్పాల్సి ఉంది. అయితే.. ఇంజనీరింగ్ అధికారులు దీన్ని పాటించనట్టు తెలుస్తోంది. నిర్మాణం పూర్తయిన ఆస్పత్రి బిల్డింగ్ వివరాలను కూడా తమకు తెలియజేయలేదని ఆయుష్ విభాగం అధికారులు చెప్పారు. నర్సింగ్ కాలేజీకి బిల్డింగ్ కేటాయించేందుకు అధికారులు సంప్రదింపులు జరినట్లు కూడా ఇంజనీరింగ్ అధికారులు ఆయుష్ విభాగం దృష్టికి తీసుకెళ్లలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిల్డింగ్ పూర్తయినా ఆ విషయం ఆయుష్ విభాగానికి తెలియజేయకుండా నర్సింగ్ కాలేజీ కోసం కేటాయించడంపై కలెక్టర్‌నుసైతం ఆ అధికారులు తప్పుదోవ పట్టిచ్చినట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ అధికారుల సమన్వయం లోపం ఇప్పుడు రెండు విభాగాల మధ్య వివాదానికి దారితీసిందని తెలుస్తోంది. మరోవైపు ఆయుష్ విభాగం ఉన్నతాధికారులు రెండు రోజుల్లో ఆస్పత్రి ప్రతిపాదిత బిల్డింగ్‌ను పరిశీలించేందుకువస్తున్నట్లు సమాచారం. దీంతో నర్సింగ్ కాలేజీని ఏంచేయాలో తెలియక అధికారయంత్రాంగం తలలు పట్టుకుంటోంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిందేనా?

తమ భవనంలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయడంపై ఆయుష్ విభాగం అధికారులు అభ్యంతరాలు చెప్పడంపై జిల్లా అధికార యంత్రాంగం సందిగ్ధంలో పడింది. తప్పనిసరిగా కాలేజీని తరలించాల్సి వస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో భవనాల లభ్యత లేకపోవడంతో నర్సింగ్ కాలేజీ ఎక్కడికి తరలిస్తారనేది సందేహంగా మారింది. కాలేజీ ఇప్పడికే 45 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందడంతో పాటు త్వరలోనే మిగిలిన 15 సీట్లు కూడా భర్తీ అయ్యే అవకాశం ఉంది. తరగతులు ప్రారంభమయ్యే దశలో వివాదం తలెత్తడంతో విద్యార్థుల పరిస్థితి ఏమిటని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

లైసెన్సు పొందాలంటే నేరుగానే రావాలి

ముఖాముఖి

జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జ్ అధికారి ఎం.డి.సమ్దానీ



ఆంధ్రజ్యోతి: రవాణా శాఖలో ఎన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి? కార్యాలయానికి రాకుండా ఎన్ని పనులు చేసుకోవచ్చు.?

డీటీవో: ఈ శాఖలో మొత్తంగా 56 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి 11, రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 2, పర్మిట్లకు సంబంధించి 4 సేవలు.. మొత్తంగా సేవలు కార్యాలయానికి రాకుండానే పొందొచ్చు.

ఆంధ్రజ్యోతి: ఓవర్‌లోడ్ వాహనాలపై మీరు తీసుకొనే చర్యలు?

డీటీవో: ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ముమ్మరంగా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. జరిమానాలు కూడా విధిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఫిట్‌నెస్ లేకుండా కళాశాలలు, పాఠశాలల బస్సులు నడుస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.. మీరేమంటారు.?

డీటీవో: జూన్ 15వ వరకే ఫిట్‌నెస్ దాదాపు అన్ని వాహనాలకు పూర్తయ్యాయి. ఇంకా ఎవరైనా ఫిట్‌నెస్ లేకుండా బస్సులను నడిపిస్తే చర్యలు తీసుకుంటా. పట్టుబడితే సీజ్ చేస్తాం. స్కూలు బస్సులు వివాహాలకు పెట్టినా చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి: ఏజెంట్లతో రాకుంటే కార్యాలయంలో ఏపని కాదనే ఆరోపణలు ఉన్నాయి.. మీరేమంటారు.?

డీటీవో: ఏజెంట్లకు ఇక్కడి పనులకు ఎలాంటి సంబంధం ఉండదు. ఎవరూ ఏజెంట్లను సంప్రదించొద్దు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని నేరుగా కార్యాలయానికి వస్తే సరిపోతుంది.

ఆంధ్రజ్యోతి: మీ కార్యాలయంలో సరిపడా సిబ్బంది ఉన్నారా?

డీటీవో: మా కార్యాలయంలో మినిస్ట్రియల్ స్టాఫ్ సరిపడా ఉంది. ఎగ్జిక్యూటీవ్ స్టాఫ్‌లో ఒక ఎంవీఐ, ఒక కానిస్టేబుల్, ఒక జూనియర్ అసిస్టెంట్ నియామకం కావాల్సి ఉంది.

- భూపాలపల్లి కృష్ణకాలనీ

సీపీఎం జిల్లా కార్యదర్శిగా సాంబశివ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నూతన కార్యదర్శి సాంబశివ

ములుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శిగా బీరెడ్డి సాంబశివ ఎంపికయ్యారు. ఏటూరునాగారంలో ఈనెల 6, 7 తేదీల్లో జరిగిన పార్టీ జిల్లా రెండో మహాసభల్లో నూతన కమిటీని ప్రకటించారు. కార్యదర్శివర్గ సభ్యులుగా తుమ్మల వెంకటరెడ్డి, రత్నం రాజేందర్, పొదిళ్ల చిట్టిబాబు, కొప్పుల రఘుపతి, గ్యానం వాసు, ఎమ్డీ.దావూద్, జిల్లా కమిటీ సభ్యులుగా ఎమ్డీ.గఫూర్, తీగల ఆగిరెడ్డి, సోమ మల్లారెడ్డి, గొంది రాజేష్, దుగ్గి చిరంజీవి, కుమ్మరి శ్రీను, వంక రాములు, జాగటి చిన్న, కట్ల నర్సింహాచారి, జెజ్జర దామోదర్, గుగ్గిళ్ల దేవయ్య, బచ్చల కృష్ణబాబు, బచ్చల సౌమ్య ఎంపికయ్యారు. ములుగులో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో జిల్లా మహాసభల సందర్భంగా ఆమోదించిన తీర్మానాలను నూతన కార్యదర్శి సాంబశివ వెల్లడించారు. జిల్లా రైతులకు గోదావరి జలాలను అందించాలని, మోడికంట, గుండ్లవాగు ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని, పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు హక్కుపత్రాలు జారీ చేయాలని, కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ-ఫారెస్టు మధ్య వివాదాస్పదంగా ఉన్న నాలుగు వేల ఎకరాలపై జాయింట్ సర్వే చేయాలని, ఏజెన్సీ గ్రామాలలో అభివృద్ధి పనులకు అటవీశాఖ అభ్యంతరాలను తొలగించాలని, మిర్చిని నిల్వచేసేందుకు శీతల గిడ్డంగులు నిర్మించాలని కోరారు. కమలాపురం బిల్ట్ కర్మాగారం స్థానంలో వెంటనే కొత్త ఫ్యాక్టరీని నిర్మించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలనే తదితర తీర్మానాలను ఆమోదించినట్లు వెల్లడించారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

మొగుళ్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై బి.అశోక్ ఆదివారం తెలిపారు. మొగుళ్లపల్లికి చెందిన దేవునూరి పద్మ అనే మహిళ ఇంటి వద్ద గుడుంబా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి 50 ప్యాకెట్లను పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే చిట్యాల మండలం గిద్దముత్తారం గ్రామానికి చెందిన ఇస్లావత్ తిరుపతి 50గుడుంబా ప్యాకెట్లు విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లోని ప్రజలు గుడుంబాపై సమాచారం అందించాలని ఆయన కోరారు.

నేటి నుంచి సింగరేణి భద్రతా పక్షోత్సవాలు

కాకతీయఖని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భద్రతా పక్షోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గనులు, డిపార్టుమెంట్స్, సోలార్ ప్లాంట్స్, కార్మిక కాలనీల్లో ఈ వేడుకలు నిర్వహించనుండగా ఈనెల 21న ముగియనున్నాయి. ఇందులో భాగం గా భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1వ గనిలో ఈన్‌వీ జీఎం సైదులు బృందం సోమవారం పర్యటించనుంది. 10,11,12 తేదీల్లో కేటీకే-5,6,8 గనుల్లో జరగనున్న పక్షోత్సవాల్లో ఇదే బృందం పాల్గొననుంది. 11,12వ తేదీల్లో ఎక్స్‌ప్లోరేషన్ డిపార్ట్‌మెంటులో ఏజీఎం(ఎస్టేట్స్, కార్పొరేట్) వెంకటాచారి, బృందం పర్యటించనుంది. 12న ఆక్యూపేషన్ హెల్త్ సర్వీస్ సెంటర్‌లో జీఎం (క్వాలిటీ బెల్లంపల్లి రీజియన్) సుశాంత్‌షా బృందం పర్యటిస్తుంది. ఈ నెల 13న సోలార్ ప్రాజెక్టను ఫిడ్డర్‌లాడ్ జీఎం(ఈఅండ్‌ఎం) జేసురత్నం బృందం పర్యవేక్షించనుంది. అదే రోజు తాడిచర్ల ఓసీని, టీఎస్ జెన్కోను జీఎం (డైరెక్టర్ ఓపీ) వెంకటేశ్వర్‌రావు బృందం పర్యటిస్తుంది. ఇదే బృందం 14న కేటీకే- ఓసీ-3, 16న కేటీకే- ఓసీ-2ను పరిశీలించనుంది. 16న కార్మిక కాలనీలు, ఏరియా వర్క్ షాపులో జీఎం (ఈఅండ్‌ఎం) దామోదర్‌రావు బృందం పర్యటించనుంది. 19న ఏరియా జీవీటీసీని ఎస్‌వో టూ జీఎం (కొత్తగూ డెం ఏరియా) జీవీ.కోటిరెడ్డి బృందం పర్యటించనుంది.



'సేఫ్టీ' ప్రశ్నార్థకం!

- సింగరేణిలో ఐదేళ్లలో 171 ప్రమాదాలు
- పదేళ్లలో ఐదుగురి మృతి
- బొగ్గు గనుల్లో కార్మికులకు రక్షణ కరువు
- తూతూమంత్రంగా చర్యలు
- పేరుకే భద్రతా పక్షోత్సవాలు

వివరాలు 8వ పేజీలో...

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కల్యాణి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ములుగులో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగా కల్యాణి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు చౌరస్తాలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి కల్యాణి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండురోజుల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేసిందని అన్నారు. అంతేకాకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తోందని అన్నారు. అదేవిధంగా మంత్రి సీతక్క ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తూ అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరెడ్డి భగవాన్‌రెడ్డి, నాయకులు చిక్కుల రాములు, ఎమ్డీ.చాంద్‌పాషా, ఎమ్డీ.అఫ్సర్‌పాషా, నల్లెల భరత్‌కుమార్, బండి శ్రీనివాస్, ఓరుగంటి అనిల్, జిల్లాలోని మహిళా నాయకురాళ్లు మద్దెల నాగమణి, నిర్మల, అమృత, చిలుకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో రైతులు

కాటారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులను మబ్బులు హడలెత్తిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు రాగా వాతావణం వారిని భయాందోళనకు గురిచేస్తోంది. ఇటీవల పలు చోట్ల వర్షం కురవగా మండలంలో చినుకులు మాత్రమే పడటంతో రైతులు కాస్త ఊరిపి పీల్చుకున్నారు. రెండు రోజులుగా ఆకాశంలో మబ్బులు పట్టడంతో వడ్ల కుప్పలు తడ వకుండా నానా తంటాలు పడుతున్నారు. వడ్లను శుభ్రం చేయ డానికి ప్యాడీ క్లీనర్లతో పట్టడం, తేమశాతం 17 కోసం ఆరబెట్టడం చేస్తూ ఇబ్బందులు పడుతుండగా ఆకాశంలో మబ్బులు పట్టడంతో బిక్కుబిక్కుమంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం చేయకుండా వడ్ల కాంటాలను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమం డీఈవో ముద్దమల్ల రాజేందర్ అధ్యక్షత జరగ్గా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యాన్వేషణ అనేది సైన్స్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని అన్నారు. రెండు రోజులుగా నిర్వహించిన ఈ సైన్స్‌ఫేర్ అందరి సహకారంతో విజయవంతం కావడం హర్షణీయ మన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరీక్షల విభాగాధికారి మందల రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ కార్యదర్శి శనిగరపు భద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి స్వామి, కన్వీనర్లు, సభ్యులు, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, ప్రభాకర్, దేవానాయక్, లక్ష్మణ్‌బాబు, ఉప్పలయ్య, వెంకటరాజం, కుమార స్వామి, వడుప్సా నాయకులు సాంబయ్య, రాజ్‌మహ్మద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కోటగుళ్ల ఆలయం

సాస్కీ పథకానికి కోటగుళ్లు ఎంపిక

గణపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా గణపురంలోని కోటగుళ్లకు మహర్దశ పట్టనుంది. స్పెషల్ అసిస్టెంట్ టు స్టేట్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) పథకానికి ఈ చారిత్రక కట్టడం ఎంపికైంది. కాకతీయుల వారసత్వ సంపద అయిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయంతో పాటు గణపురంలోని కోటగుళ్లు, గణప సముద్రం సరస్సు, రామప్ప సమీపంలోని ఇంచర్ల గ్రామాన్ని ఈ స్కీం ద్వారా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు కేంద్ర పర్యాటక శాఖ రూ. 73.74 కోట్లు మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 800 ఏళ్లనాటి కోటగుళ్లకు కొత్త రూపు సంతరించుకోనుంది.

రామప్పలో సందర్శకుల సందడి


ఆలయ ఆవరణలో విదేశీయులు

వెంకటాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో విద్యార్థుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవాలయానికి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ శిల్పకళా సంపదను పరిశీలించి మైమరచిపోయారు. అలాగే రామప్ప దేవాలయాన్ని యూరప్ దేశానికి చెందిన పర్యటకులు రోమన్, స్టర్న్ సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ఆలయ శిల్పకళా సంపదను వీక్షించారు. రామప్ప సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

నిర్దిష్ట పరిస్థితుల పరిశీలనే లెనినిజం

ప్రజాపంథా మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచందర్



సమావేశంలో మాట్లాడుతున్న రామచందర్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా పరిశీలన చేయడమే లెనినిజమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేజీ రామచందర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జిల్లా కమిటీ ఒక్కరోజు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ సరుకుల వినియోగం పెరిగిన ఏ సమాజమైన పెట్టుబడి విధానమేనని, కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముకునే స్వేచ్ఛ మనదేశంలో పెద్దఎత్తున పెరిగిందని చెప్పారు. అందుకే అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారి దేశంగా భారతదేశాన్ని అంచనా వేశామన్నారు. భారతదేశంలో అతివాదం, మితవాదం, అవకాశవాదంలు భారత విప్లవోద్యమాన్ని తీవ్రంగా నష్టపరుస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రమ, ముంజంపల్లి వీరన్న, పూనెం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, బండపల్లి వెంకటేశ్వర్లు, సమ్మయ్య, రాములు, అవుల కట్టయ్య, ఫైండ్ల యాకయ్య, రంగయ్య, పాపారావు, జక్కుల యాకయ్య, వెంకన్న, రమేష్, లచ్చయ్య, భద్రక్క తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో సీఎం కప్ టోర్నమెంట్

దంతాలపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలు దంతాలపల్లి పంచాయతీ కార్యదర్శి కమిటీ చైర్మన్ ఏశబోయిన వెంకన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. మండలంలోని క్రీడాకారులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో స్త్రీ, పురుషులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల పీడీ నాగిరెడ్డి, జ్యోతిబా పూలే ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

ప్రభుత్వాన్ని కూల్చాలని బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు

- కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు..
- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మహబూబాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వాన్ని ఎప్పుడు కూల్చుదామా అని కుట్రలు చేస్తున్నాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వకుండా అభివృద్ధి చేస్తున్న సర్కార్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకోవడం సరికాదన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్‌గా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడమే బీఆర్ఎస్ పనిగా పెట్టుకుందన్నారు.

అర్బన్ నక్సలైట్లుగా క్యాబినెట్‌పై ముద్ర వేయడం సరికాదు

రాష్ట్ర క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు ఉన్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అనడంలో అంతర్యమేమిటని మంత్రి సీతక్క అన్నారు. తాను ఒక్కదానే నక్సలైట్ నేపథ్యం నుంచి వచ్చానని, ఏదైనా అనాలనుకుంటే నేరుగా తనను అనాలే తప్ప క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు ఉన్నారని కేంద్రమంత్రి హోదాలో మాట్లాడడం సరికాదన్నారు. తాను ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన మాట వాస్తవమేనని, తాను ఉద్యమాల నుంచి బయటకు వచ్చాక ఐదేళ్లుగా న్యాయవాదిగా పనిచేశానని, మూడుసార్లు ములుగు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించానని, 20 సంవత్సరాల తర్వాత ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. తనను రాజకీయంగా దెబ్బ తీయడానికే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అణిచివేయబడ్డ కులాల నుంచి తాను ఈ స్థాయికి చేరడంతో ఓర్వలేకనే తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను తొలుత ములుగు ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో టీడీపీ, బీజేపీ అలయన్స్‌లో పోటీ చేశానని, అప్పుడు బీజేపీకి తాను అర్బన్ నక్సలైట్‌నని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ కావాలనే తన ఉద్దేశమని, శాంతియుత వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణలో ఎన్‌కౌంటర్ జరగడం బాధకరమన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మద్ది శ్రీనివాస్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ మదన్‌గోపాల్ పాల్గొన్నారు.

'ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని నాయకులు వీరన్న, జానకిరాములు, ఖాదర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబరులో జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తున్న శిబిరాన్ని సందర్శించి, ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిందని, తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రభాకర్, గణేష్, సాగర్, ప్రభావతి, విజయలక్ష్మి, నవీన్ పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాల ధరించిన అయ్యప్ప స్వాములు ఒకేచోట చేరి పూజలు నిర్వహించుకుని భక్తి భావాన్ని పెంపొందించుకోవడం అభినందనీయం అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరులోని పాటిమీద గల అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన కన్నె స్వాముల పూజకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని కలిగి ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని, మొదటి సారి మాల వేసుకున్న స్వాములను కన్నె స్వాములుగా పూజించడం అభినందనీయమని అన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. గురుస్వాములు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, గురుస్వాములు మాజేటి నర్సింహారావు, శివ శర్మ, కిషన్ యాదవ్, బిజ్జాల అనిల్, కృపాకర్ రాజు, శేఖర్, శ్రీను, హరి, విజయపాల్ రెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, అయ్యప్ప భక్తులు, కన్నె స్వాములు, మాలధారులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణ శివారు అనంతారం రోడ్డులోని ఆర్తిగార్డెన్స్ సమీపంలో శనివారం అర్ధరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణ శివారు గాంధీపురానికి చెందిన స్థానిక మునిసిపల్ 4వ వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమా భర్త యాకయ్య తన ద్విచక్ర వాహనంపై సొంత పనిమీద జిల్లా కేంద్రానికి వచ్చి ఇంటికి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బయ్యారం వైపు నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో యాకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అర్బన్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి యాకయ్యను పరామర్శించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని..

కేసముద్రం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేరువాడ శివారు బోడమంచ్యాతండా సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో గూడూరు మండలం అప్పరాజుపల్లి ఏఆర్‌తండాకు చెందిన మూడు మొగిలేష్‌కు గాయాలైనట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఆర్టీసీ బస్సు మహబూబాబాద్ నుంచి కేసముద్రం వైపునకు వస్తుండగా బైక్ మానుకోట వైపునకు వెళుతోంది. మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో మొగిలేష్ కాళ్లకు గాయాలు కాగా మహబూబాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

సమస్యల వలయంలో వసతి గృహాలు

- భయాందోళనలో దంతాలపల్లి మండల విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


ఎస్టీ హాస్టల్‌లో ఊడుతున్న భవనం పైకప్పు పెచ్చులు


నిరుపయోగంగా మారిన స్నానపు గదులు, మరుగుదొడ్లు

దంతాలపల్లి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లోని విద్యార్థులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. దంతాలపల్లిలోని గిరిజన వసతి గృహం, పెద్దముప్పారంలోని హరిజన వసతి గృహం, మండల కేంద్రంల్లోని జ్యోతిబా పూలే విద్యార్థులకు కనీస వసతులు లేకపోవడంతో పగలు, రాత్రి పూటల్లో భయందోళన నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. 1994లో దంతాలపల్లి గిరిజన వసతి గృహం (ఎస్టీ హాస్టల్) భవనాన్ని నిర్మించారు. ఆ నాడు 280 మంది విద్యార్థులతో కొనసాగిన హాస్టల్‌లో నేడు వందకు మాత్రమే పరిమితమైంది. దీనికి గల ప్రధాన కారణం అధికారుల వైఫల్యమేనని పలువురు గిరిజన మేధావులు ఆరోపిస్తున్నారు. పెద్దముప్పారంలోని ఎస్సీ వసతి గృహంలో నాడు 200 మందితో ఏర్పాటు అయిన వసతి గృహంలో నేడు విద్యార్థులు పదుల సంఖ్యలో ఉన్నారు. దీనికి ప్రధాన కారణం హాస్టల్ అధికారుల నిర్లక్ష్యమే.

గదుల్లో ఊడుతున్న పెచ్చులు..

దంతాలపల్లిలోని గిరిజన వసతి గృహంలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. మొత్తం 12 గదుల్లో నేడు 10 వరకు పెచ్చులు ఊడిపోవడంతో విద్యార్థులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. చేతి పంపు సైతం పదేళ్లుగా పని చేయడంలేదు. మొత్తం 168 మంది విద్యార్థులకు సక్రమంగా స్నానపు గదులు, మరుగు దొడ్లు లేదు. నీటి వసతి ఉన్నా, ఉప్పు నీరు కావడంతో విద్యార్థులు నానా తంటాలు పడుతున్నారు. దంతాలపల్లి ఎస్టీ హాస్టల్‌లో ప్రభుత్వం పంపిణీ చేసిన వంట పాత్రలు నేటికి నిరుపయోగంగా మారాయి. పిండి వంటలు చేసే మిషన్లు వంట గదిలో నిరుపయోగంగా పడి ఉన్నాయి.

కానరాని గేటు..

పెద్దముప్పారంలోని ఎస్సీ వసతి గృహంలో విద్యార్థుల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన బయోమెట్రిక్ సిస్టం నిరుపయోగంగా మారింది. పూర్తిస్థాయిలో గేటులేకపోవడంతో పశువులు, కుక్కలు, పందులు వస్తున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జ్యోతిబా పూలే ఆశ్రమ పాఠశాలలో..

మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు డైనింగ్ హాల్ లేకపోవడంతో ఆరుబయట రేకుల షెడ్డులోనే నేలపైనే కుర్చొని భోజనం చేస్తున్నారు. పక్కా భవనం లేకపోవడంతో పూర్తిస్థాయిలో వసతులు అందుబాటులో లేక స్వల్ప ఇబ్బందులు తప్పడం లేదు.

రేపు కేయూ మెడికల్ ఆఫీసర్ల ఎంపిక ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం ఒప్పంద ప్రతిపాదికన స్త్రీ, పురుష మెడికల్ అభ్యర్థుల ఎంపిక ఇంటర్వ్యూలు డిసెంబరు 10న మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ల వారిగా నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు దర ఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ ఇప్పటికే సమాచారం అందచేసినట్లు స్పష్టం చేశారు.

పురుష అభ్యర్థులకు 10న మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి, స్త్రీ అభ్యర్థులకు 10న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. కేయూ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో అభ్యర్థుల ఎంపిక ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులందరూ తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, అనుభవం, ఇతర పత్రాలన్నీ వెంట తెచ్చుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 98494-47696, 90309-30633లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలి

టీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలు, నిర్లక్ష్య వైఖరితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులు, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు చనిపోతున్నారని, నాసిరకం భోజనాలు, కల్తీతో నరకయాతన అనుభవిస్తున్నారని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు, గురుకుల బాట ఇన్‌చార్జి బైరపాక ప్రశాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాచర్ల శరత్ చంద్రతో కలిసి మాట్లాడారు. గత నెల 30 నుంచి ఆదివారం వరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలో ని గురుకులను బీఆర్ఎస్వీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ ఆదేశాల మేరకు 'గురుకుల బాట' నిర్వహించి సమస్యలపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. తాము సందర్శించిన గురుకుల బాటలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అందచేస్తామని వెల్లడించారు. గురుకుల హాస్టళ్లు ప్రారంభమై 6 నెలలు గడుస్తున్నా పుస్తకాలు, బెడ్‌షీట్స్, కాస్మోటిక్స్, స్కూల్ డ్రెస్‌లను విద్యార్థులకు అందించలేదన్నారు. చలికాలంలో దుప్పట్లు లేక పేద విద్యార్థులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెట్టగా ఇప్పుడు దొడ్డు బియ్యంతో పెడుతున్నారని పేర్కొన్నారు. కొన్ని గురుకులాల్లో భోజన మెనూ పాటించడం లేదని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం అర్బన్ కోఆర్డినేటర్ గండ్రకోట రాజేశ్ యాదవ్, రాష్ట్ర నాయకులు గొల్లపల్లి వీరస్వామి, వర్సిటీ నేతలు పస్తం అనిల్ పాల్గొన్నారు.

సాగునీరు అందేదెలా?!

- పూడుకుపోయిన ఎస్సారెస్పీ కాల్వలు
- అధ్వానంగా డీబీఎం 38
- పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు



రేగొండ మండలంలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో పేరుకుపోయిన ఎస్సారెస్పీ డీబీఎం 38 కాల్వ

రేగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) కాల్వల పరిస్థితి భూపాలపల్లి జిల్లాలో అధ్వానంగా మారింది. వేలాది ఎకరాలకు జీవనాధారమైన వీటి మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. ముఖ్యంగా డీబీఎం 38 కాల్వ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో దీని ద్వారా సాగునీరు పారే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. ప్రతి ఏడాది మరమ్మతులు చేపట్టినా చివరి ఆయకట్టు వరకు నీరు అందిన సందర్భం అరుదే. ఈసారైతే పరిస్థితి మరింత ఆగమ్యగోచరంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈఏడాది నీరు పారే అవకాశం కనిపించడం లేదు.

యాసంగి దగ్గరపడుతున్నా ఇంకా మరమ్మతులపై అధికారులు దృష్టి సారించకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

సకాలంలో సాగు నీరందిస్తేనే..

ఇప్పటికే అనేక చోట్లా వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పలు చోట్లా ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల ఇంకా మరికొన్ని రోజుల పాటు వరి కోతలు కొనసాగనున్నాయి. రైతులు డిసెంబరు 10 నుంచి యాసంగి పంటకు నారు పోయడానికి అవకాశాలు ఉన్నాయి. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని అందిస్తేనే రైతులు మడులను సిద్ధం చేసుకుంటారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి కాల్వలను శుభ్రం చేయాలని, ధ్వంసమైన చోట రిపేర్లు చేయించాలని రైతులు కోరుతున్నారు.

చేతులు దులుపుకున్న సర్కారు

కాల్వల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించడానికి గత ప్రభుత్వాలు బడ్జెట్‌ను కేటాయించేవి. ప్రస్తుత రాష్ట్ర సర్కారు అందుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. జాతీయ ఉపాధి హామీ కూలీలతో ఈ పనులను చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. గ్రామాల్లో వ్యవసాయ పనులు నడుస్తుండటంతో కూలీలు దొరకడం లేదు. అంతేకాదు.. కాల్వల్లో ముళ్లు, సీసపు ముక్కలు లాంటివి ఉంటాయనే భయంతో వాటిలో దిగి పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ఈ క్రమంలో రేగొండ మండలంలో కొంత మంది లష్కర్లను నియమించి కాల్వల్లోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు అధికారులు ప్రణాళికలు తయారు చేసినట్టు తెలిసింది. అయితే.. యాసంగికి ఇంకా కొన్ని రోజులే మిగిలి ఉన్నాయి. అప్పటి వరకు ఈ పనులు పూర్తవుతాయా? అనేది ప్రశ్నార్థంగా మారింది. లష్కర్లతో కాకుండా యంత్రాలతో చేపడితేనే పనుల్లో జాప్యం కాదని, యాసంగికల్లా కాల్వలు సిద్ధంగా ఉంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో ఎస్సారెస్పీ కాల్వ కొత్తపల్లిగోరి మండలం నుంచి చిట్యాల మండలం మీదుగా టేకుమట్ల మండలంలోని వెలిశాల వరకు 25 కిలోమీటర్ల పొడవునా ఉంటుంది. దీని ద్వారా మొత్తం 108 చెరువులకు నీళ్లు చేరుతాయి. దీంతో మూడు మండలాల్లో మొత్తం 9,376 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే..

ఆయకట్టు 9,376 ఎకరాలు

దీన్ని రైతులు వినియోగించుకోవాలంటే కాల్వలు సాఫీగా ఉండాలి. కానీ, డీబీఎం 38 కాల్వతో పాటు ఉప కాల్వల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయాయి. అక్కడక్కడా కాల్వలు ధ్వంసమయ్యాయి. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించి, కాల్వలకు మరమ్మతులు చేపడితేనే ఈ ఏడాది పంటలకు నీళ్లు అందుతాయి. లేదంటే రైతులకు కష్టాలు తప్పవు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



నిధులివ్వండి.. అధ్యక్షా..!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- పురోగతి లేకుండా పడి ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి
- ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు గళం విప్పాలంటున్న ప్రజలు

ఓరుగల్లు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేస్తోంది. ఇప్పటికే సుమారు రూ. 10 వేల కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. అయినప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన అనేక అభివృద్ధి పనులకు నిధులు లేక వెక్కిరిస్తున్నాయి. వరంగల్ నగరంలో మెట్రో రైల్ సేవలతో పాటు ఐటీ పార్కు విస్తరణ, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం వాటికి ఇంకా అడుగులు పడటం లేదు. వీటితో పాటు అనేక నియోజకవర్గాల్లో ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల నిర్మాణం, వీవర్స్ పార్కులు, యూనివర్సిటీలు, కాలేజీలు, డ్రైనేజీ తదితర వాటికి నిధులు లేక, కొన్నింటికీ అనుమతులు లేక ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారు.

సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు ఓరుగల్లు అభివృద్ధిపై గళమెత్తుతారనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

లెదర్ పార్కుకు మోక్షం కలిగేనా?

చర్మకారులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ కేంద్రంలోని శివునిపల్లిలో 1999లో లెదర్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్‌పార్కు నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రతిపాదనలు అటకెక్కటంతో 2002లో టీడీపీ హయాంలో 25 ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు .10కోట్ల నిధులు కూడా కేటాయించారు. ఇందుకోసం తొలి విడతలో స్థానికంగా ఆసక్తితో ఉన్న 50మందికి చెన్నైలో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. 2003లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. మరో రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారీపై చెన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి లెదర్ పార్కు నిర్మాణంపై సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి లెదర్ పార్కు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారనే ఆశతో స్థానికులు ఉన్నారు.

మెట్రో రైల్ పట్టాలెక్కేనా?

వరంగల్ నగరం విస్తరిస్తుండడంతో హైదరాబాద్ తరహాలో మెట్రో రైల్ ఏర్పాటుపై గత ప్రభుత్వం సర్వే చేసింది. 2019 డిసెంబరు 24వ తేదీన అధికారులు కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కిలో మీటర్ల వరకు మెట్రో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2025లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.1,341కోట్ల అంచనా వ్యయంతో వరంగల్ మెట్రో రైల్‌కు రూపకల్పన చేశారు. 15.5కి.మీ.ల దూరంలో 7.1 కిలో మీటర్లు రోడ్డు మార్గంలో, 8.4కి.మీలు ఆకాశమార్గంలో రైల్వేట్రాక్ నిర్మించాలని నిర్ణయించారు. 21 స్టేషన్లను ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేశారు. 2021 మార్చిలో వరంగల్ మెట్రో నియో రైలు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. అయితే కేంద్రంపై ఒత్తిడిలేకపోవటంతో వరంగల్ మెట్రోకు ఐదేళ్లుగా బ్రేక్ పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం.. నగరంలో కూడా మెట్రో రైల్ పట్టా లెక్కించాలని, దీనిపై నగర పరిధిలోని మంత్రితో పాటు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

రిజర్వాయర్లు, ఎత్తిపోతలకు నిధుల గ్రహణం

పాలకుర్తి, పరకాల నియోజకవర్గాల్లో ఎత్తిపోతలు, రిజర్వాయర్లకు నిధులు లేక అర్ధాంతరంగా నిలిచి పోయాయి. గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేయటంతో సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో 2009లో పాలకుర్తి - చెన్నూరు రిజర్వాయర్ పనులకు రూ.330కోట్లతో శ్రీకారం చుట్టారు. అయితే పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోయాయి. ఆ తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఇదే రిజర్వాయర్ పనులకు రూ.370కోట్లతో ప్రతిపాదనలు చేసి, పనులు కూడా ప్రారంభించారు.

అయితే నిధుల కొరతతో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. పాలకుర్తి రిజర్వా యర్ కింద 7,516 ఎకరాల్లో, చెన్నూరు రిజర్వాయర్ ద్వారా 25,165 ఎకరాల్లో పంట సాగు కానుంది. దీనిపై పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పరకాల నియోజకవర్గంలో 2017లో గీసుకొండ మండలం కొనాయిమాకులం వద్ద రూ.63కోట్లతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. భూసేకరణ పూర్తి కాకపోవటంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ లిఫ్ట్ పూర్తి అయితే సుమారు 14వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

అలాగే జనగామ నియోజకవర్గంలో బచ్చన్నపేటలో గుడి చెరువు రిజర్వాయర్ కోసం ప్రతిపాదనలు చేసి వదిలేశారు. భూపాలపల్లిలో సీతారామ ఎత్తిపోతల పనులకు కూడా నిధుల గ్రహణం పట్టింది. అలాగే మహబూబాబాద్ జిల్లా గూడూరులో పాకాల వాగుపై రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదనల్లో నలుగుతోంది. ఈ రిజర్వాయర్ పూర్తి చేస్తే సుమారు 20వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. వీటిపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావించి, ప్రభుత్వం నిధులు సాధిస్తారనే ఆశతో రైతాంగం ఎదురుచూస్తుంది.

మైనింగ్ వర్సిటీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో సింగరేణి ప్రాంతంగా ఉన్న భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీ కోసం కార్మికుల పిల్లలు ఎదురుచూస్తున్నారు. పదేళ్లగా మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు అన్ని పార్టీలుహామీలు ఇస్తున్నాయి. అసెంబ్లి సమావేశాల్లో మైనింగ్ యూనివర్సిటీతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ కోసం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనే ఆశతో కోల్‌బెల్ట్ ప్రజలు ఉన్నారు. అలాగే డోర్నకల్ నియోజకవర్గంలో మరిపెడ మినహా ఇతర మండలాల్లో డిగ్రీ, జూనియర్ కాలేజీలు లేవు. అలాగే జనగామ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు హామీగానే మిగిలిపోయింది.

- ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో శాశ్వత అభివృద్ధి పనులకు కార్యచరణ చేపట్టాలి.
- బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపి, పనులు ప్రారంభించాలని కార్మికులు కోరుతున్నారు.
- ఏజెన్సీలో అటవీ, రెవెన్యూశాఖల మధ్య సుమారు 10వేల ఎకరాల్లో వివాదం నెలకొంది. దీనిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపేలా అసెంబ్లీలో ఈ సమస్యను ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.
- మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.
- వరంగల్ మహానగరంలో కొత్తగా ఐటీ టవర్స్‌ను తీసుకరావటంతో పాటు కొత్త పరిశ్రమలు వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని వరంగల్ వాసులు కోరుతున్నారు.
- వరంగల్ ప్రాంత విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కొత్త కోర్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా దృష్టి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

మరికొన్ని అభివృద్ధి పనులు.. సమస్యలు

- వరంగల్ కోటను మరింతా అభివృద్ధి చేసి పర్యాటక ప్రాం తంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.
- పరకాలలో రూ.30కోట్లతో చేపట్టిన వంద పడకల అస్పత్రి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీనికి నిధులు తీసుక వచ్చే అస్పత్రి పనులు పూర్తి చేయాలి.
- పరకాల మినీ ట్యాంక్‌బండ్‌ను రూ.40కోట్లతో చేపట్టారు. నిధుల లేక నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- పాలకుర్తి నియోజవర్గంలోని కొడకండ్లలో గత ప్రభుత్వం రూ.61 కోట్లతో మినీ టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించి వదిలేశారు. దీన్ని పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చొవరచూపాలని కోరుతున్నారు.
- మహబూబాబాద్ జిల్లా కేంద్రం భారీగా విస్తరిస్తుండటంతో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వంపై జిల్లా ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకరావాలని యువత కోరుతోంది.
- కేసముద్రంలో అగ్నిమాక కేంద్రం, డోర్నకల్‌లో మిర్చి యార్డు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- గత వర్షాలకు మున్నేరు, మానేరు వాగులపై దెబ్బతిన్న ముల్కలపల్లి, చిన్నగూడూరు, కౌసల్యదేవిపల్లి వద్ద వంతెనల నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- వర్ధన్నపేట ప్రభుత్వ అస్పత్రిని వందపడకల అస్పత్రి అప్‌గ్రేడ్ చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవనం నిర్మించాలని కోరుతున్నారు.

పేటలో వైభవంగా పల్లివేట



నర్సంపేట అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అయ్యప్ప స్వామి ఊరేగింపులో విన్యాసాలు ప్రదర్శిస్తున్న కళాకారులు


- అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు
- మార్మోగిన మణికంఠ నామస్మరణ

నర్సంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని శబరిమలై సన్నిధానం సమీపంలోని పుంగావనంలో ఏ విధంగా జరుగుతుందో.. అదే రీతిలో నర్సంపేటలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ సేవా చారిటబుల్ ట్రస్టు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా పల్లివేట ఉత్సవాన్ని నిర్వహించారు. పల్లివేట దాత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో గురుస్వామి వెంకటేష్‌శర్మ నిర్వహించారు. నర్సంపేటలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో 24వ (చతుర్వింశతి) మండల పూజా మహోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోనే నర్సంపేటలో అత్యంత వైభవంగా జరిగే పల్లివేట ఉత్సవాన్ని నర్సంపేటలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరి కొండ మాధవ శంకర్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన తాంత్రికవేత్త గురుస్వామి సీహెచ్.వెంకటేశ్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ ఆదివారం ఉదయం 10.30 గంటలకు అయ్యప్ప ఆలయంలో గురుస్వాములతో కలిసి ఉత్సవబలి, క్షేత్రబలి పూజా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో బలిపీఠాలకు వివిధ రకాల నైవేద్య పూజలను వెంకటేశ్‌శర్మ నిర్వహించారు. అయ్యప్ప ఆలయ గర్భగుడి ముందు భాగంలో పల్లివేట దాత గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీభార్గవి, తండ్రి గోగుల ప్రతాప్‌రెడ్డి, రాణా సోదరి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమలతో గురుస్వామి వెంకటేశ్ శర్మ ప్రత్యేక పూజలు చేయించారు.

అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని గురుస్వామి వెంకటేశ్ శర్మ రాణా ప్రతాప్‌రెడ్డికి అందించగా ఆయన విగ్రహాన్ని నెత్తిన ఎత్తుకొని గుడిచుట్టూ మాలాధారులతో కలిసి ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షణ అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి అయ్యప్ప విగ్రహాన్ని రాణా ప్రతాప్‌రెడ్డి నెత్తిన ఎత్తుకొని అలంకరించి ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించారు. డప్పుచప్పుళ్ల, మహిళల కోలాటాల, మాలాధారుల నృత్యాలు, కళాకారుల విన్యాసాల నడుమ ఊరేగింపును మునిసిపల్ కార్యాలయం ఆవరణ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బీజేపీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర శ్రీనివాస్, రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రాంచంద్రారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గూడూరు సందీప్, కొంపెల్లి రాజు, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రత్నం సతీష్, హనుమకొండ 40వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఎర్రగోళ్ల భరత్‌వీర్, ఆలయ అర్చకుడు దినేశ్ మిశ్రా, ఆలయ కమిటీ అధ్యక్షుడు పైసా సురేశ్, గురుస్వాములు కోడిజుట్టు అనిల్ ఇతర గురుస్వాములు, ఆలయ కమిటీ సభులు, భక్తులు, మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పల్లివేట ఉత్సవం

నర్సంపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పుంగావనం (కుటీరం)లో గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీ భార్గవి, తండ్రి గోగుల ప్రతాప్‌రెడ్డితో నిర్వహించిన పల్లివేట ఉత్సవం భక్తులను, మాలాధారులను ఎంతగానో ఆకట్టు కుంది. పుంగావనం కుటీరంలో గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీభార్గవితో పుష్పాభిషేక పూజలను గురుస్వామి వెంకటేశ్‌శర్మ వేద మంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామికి అభిషేక పూజలు చేయించారు. పల్లివేట వేడుకలో యువకులు ఓం జెండాలు చేతబూని పాల్గొనడం శుభ సూచికమని గురుస్వామి వెంకటేశ్‌శర్మ అన్నారు.



హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్

9.09 కోట్ల మందికి ఉచిత బస్సు

- ఉమ్మడి వరంగల్‌లో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఆర్టీసీకి రూ.403.70 కోట్ల రవాణా చార్జీలు ఆదా
- నేటితో 'మహాలక్ష్మి' పథకానికి యేడాది

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆరు గ్యారంటీలలో భాగంగా మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి నేటికి ఏడాది పూర్తయింది. సీఎం రేవంత్‌రెడ్డి 2023 డిసెంబరు 7న ప్రమాణం స్వీకారం చేసిన తర్వాత ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ మొదటి సంతకం చేశారు. దీంతో 2023 డిసెంబరు 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. కాగా, ఉచిత ప్రయాణంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా ప్రయాణికులు రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ కార్డుతోనే వివిధ ప్రాంతాలకు ఉచితంగా ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ రీజియన్ పరిధిలో 9 డిపోలో మహిళలకు మొత్తం 9.09 కోట్ల మంది మహిళా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహిళలకు ఉచిత ప్రయాణంతో రూ.403.70కోట్లు రవాణా చార్జీలు ఆదా అయినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ రీజియన్ పరిధిలో మొత్తం 924 ఆర్టీసీ సర్వీస్ బస్సులు ఉండగా, మహాలక్ష్మి పథకం అమలు కావడంతో 744 బస్సు సర్వీస్‌లను కేటాయించినట్లు తెలిపారు. హనుమకొండ డిపో 1.76 కోట్ల మహిళా ప్రయాణికులు ప్రయాణించారు.

మొత్తం రూ.57.67కోట్లు అదా, వరంగల్-1 డిపోలో 80లక్షల మహిళ ప్రయాణికులు ప్రయాణించగా మొత్తం 38.33 కోట్లు, పరకాల డిపో 90 లక్షల మహిళ ప్రయాణికులు ప్రయాణించగా 36.77 కోట్లు, భూపాలపల్లి డిపోలో 85 లక్షల మహిళ ప్రయాణికులు ప్రయాణించగా, రూ.43.93 కోట్లు, జనగామ డిపోలో 1.37 కోట్ల మహిళా ప్రయా ణికులు ప్రయాణించగా రూ. 65.01 కోట్లు, మహబూబాబాద్ 79 లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ.33.94 కోట్లు, నర్సంపేట డిపోలో 1.02 కోట్ల మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ.44.16 కోట్లు, తొర్రూరు డిపోలో 88లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ.49.28 కోట్లు.. మొత్తం ఉమ్మడి వరంగల్ రిజియన్ పరిధిలోని 9 డిపోలలో 9.09 కోట్ల మహిళా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణించగా, మొత్తం రవాణా చార్జీలు రూ.403.70 కోట్లు మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు ఆర్థిక తోడ్పాటు



ఆర్ఎం విజయభాను

మహిళల కోసం మహాలక్ష్మీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం ద్వారా ఎంతో మంది గ్రామీణ పేద మహిళలకు ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. ఈ పథకం ద్వారా ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. రానున్న రోజుల్లో మహిళలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం. మహి ళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు వరంగల్‌కు వస్తే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేసి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలి.

శివనగర్‌లో బయల్పడిన విగ్రహాలు

కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేసిన మహిళలు



అండర్ డ్రైనేజీ తవ్వకాల్లో బయల్పడిన కాకతీయుల కాలం నాటి విగ్రహాలు

ఖిలా వరంగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శివనగర్ నుంచి ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు వరకు చేపట్టిన అండర్ డ్రైయినేజీ తవ్వకాలలో ఆదివారం కాకతీయుల కాలంనాటి విగ్రహాలు బయల్పడ్డాయి. శివలింగం, నంది, సూర్యచంద్రులు, ఆవు, దూడ వంటి విగ్రహాలు లభించాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు కాలువలో నుంచి వాటిని బయటకు తీసి పూజలు చేశారు. మహిళలు కొబ్బరి కాయలు కొట్టి, పసుపు, కుంకుమలు చల్లి పూజలు చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రందించగా సోమవారం వాటిని పరిశీలించి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

ప్రజా సేవకు ఓ రేటు


- ప్రజలను పట్టి పీడిస్తున్న లంచగొండు ఉద్యోగులు
- పైసలు ఇవ్వనిదే ఫైలు ముందుకు కదలని వైనం
- ప్రభుత్వ ఆఫీసుల్లో అమలు కాని సిటిజన్ చార్ట్
- నేడు ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లోని కొంతమంది ఉద్యోగులు ప్రజలను జలగల్లా పట్టిపీడిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ ప్రజలకు సేవ చేయాల్సిన ఉద్యోగులు అవినీతికి మరిగి అక్రమ సంపాదన కోసం పాకులాడుతున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా చేయి తడుపందే పని కాదనే విషయాన్ని కొంత మంది అధికారుల ద్వారా అర్థమైపోతోంది. కార్యాలయాలు చుట్టూ చెప్పులరిగేలా తిరిగి చివరికి ఏమి చేయలేక లంచగొండి ఉద్యోగులకు ఎంతో కొంత ముట్టజెప్పి పని కానిచ్చుకోవడం షరా మామూలైపోయింది. లంచం ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించిన వాళ్లకు సాకులు చెబుతూ పనిని పెండింగ్‌లో పెడుతున్నారు. వారిలో కొంత మంది ధైర్యం చేసి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసి పట్టిస్తుండగా అడ్డం గా దొరికి ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరికొంత మంది జైలు జీవితం అనుభవిసున్నారు.

విద్యుత్‌శాఖలో బహిరంగంగా లంచం తీసుకోవద్దని పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసినప్ప టికీ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 18 కేసుల్లో 28 పట్టుబడగా, 2011 కేసుల్లో పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ కనకం చంద్రయ్యకు ఈ ఏడాది ఫిబ్రవరిలో 21 ఏడాది జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానాను ఏసీబీ కోర్టు విధించింది. డిసెంబర్ 9 ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రభుత్వశాఖల్లో ఉద్యోగులు లంచం ఇవ్వాలని వేధిస్తే ధైర్యంగా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. 1064 టోల్ ఫ్రీ నెంబర్, 9154388312 నెంబర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి



ఈ ఏడాదిలో పట్టుబడ్డ ఉద్యోగులు

- కేయూ హాస్టల్‌కు పాలు, పెరుగు సరఫరా చేస్తున్న కాశిబుగ్గకు చెందిన పాల వ్యాపారి పెండెం రాజేందర్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య రూ. 50,000 తీసుకుంటూ జనవరి 5న ఏసీబీకి పట్టుబడ్డాడు.
- యశ్వంతాపూర్‌కు చెందిన కాముని స్రవంతి ఫార్మసిస్టుకు రఘునాథపల్లిలో పోస్టింగ్ ఇవ్వడానికి జనగామ వైద్యాధికారి శేపూరి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ రూ.50,000 తీసుకుంటూ జనవరి 11న పట్టుబడ్డాడు.
- అక్రమాస్తుల కేసులో మార్చి 4న తొర్రూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పొలం సుమతి పట్టుబడింది.
- మార్చి 22న స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో గుండగాని హరీష్ నుంచి మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, ఔట్ సోర్సింగ్ ఆపరేటర్ ఆలేటి వేంకటేశ్ రూ.19,200 తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 15న ఆర్టీసీ విచారణలో భాగంగా హుజూరాబాద్ డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ డ్రైవర్ తాటికొండ రవీందర్ నుంచి రూ.20వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- ఏప్రిల్ 26న సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా అక్రమాస్తుల కేసుల్లో పట్టుబడింది.
- మే 5 గిఫ్ట్ రిజిస్ట్రేషన్ విషయంలో రూ.5000 లంచం తీసుకుంటూ కమలాపూర్ తహసీల్దార్ పాలకుర్తి మాధవి, ధరణి ఆపరేటర్ రాజేశ్ పట్టుబడ్డారు.
- జూలై 9న రూ.20వేలు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి శివాజీ పట్టుబడ్డాడు.
- జూలై 25 గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ విషయంలో రూ.80వేలు తీసుకుంటూ కందాల సునిత, బొట్ల నరేశ్ పట్టుబడ్డాడు.
- ఆగస్టు 1న మహబూబాబాద్ డీటీవో కార్యాలయంలో వసూళ్లకు పాల్పడుతూ గౌస్‌పాషా పట్టుబడ్డాడు.
- ఆగస్టు 2న రూ.20,000 తీసుకుంటూ పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న పట్టుబడ్డాడు.
- ఆగస్టు 12న పంచాతీరాజ్ ఏఈ గుగులోతు గోపాల్, 18న ఎండోమెంట్ ఆఫీసర్ బోగొజు భిక్షంచారి, 31న ఎలక్ట్రిసిటీ డీఈ మాలోత్ హుస్సేన్ నాయక్ రూ 20వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు. సెప్టెంబరు 27 రోడ్డు అండ్ బిల్డింగ్స్ డిపార్ట్‌మెంట్ చిలుకపాటి హుస్సేన్, అద్నాల రవీందర్ పట్టుబడ్డారు. అక్టోబరు 24న పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సంపతి దిలీప్‌కుమార్, వలుపదాసు శోభారాణి పట్టుబడ్డారు. నవంబరు 21న మహబూబాబాద్ ల్యాండ్ రికార్డ్సులో కలంగి జ్యోతి క్షేమ బాయి రూ.20వేలు తీసుకుంటూ పట్టుబడింది. 28న గాదె కార్తీక్ పంచాయతీరాజ్ ఏఈ పట్టుబడ్డాడు.

కార్మికుల 'సేఫ్టీ' ప్రశ్నార్థకం!

- సింగరేణిలో ఐదేళ్లల్లో 171 ప్రమాదాలు
- పదేళ్లలో ఐదుగురి మృతి
- బొగ్గు గనుల్లో రక్షణ కరువు
- పట్టించుకోని అధికారులు
- తూతూమంత్రంగా చర్యలు

నేటి నుంచి భద్రతా పక్షోత్సవాలు



కాకతీయఖని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కరువైందనే విమర్శలు వస్తున్నాయి. భూపాలపల్లి ఏరియాలో ప్రతి ఏడాది పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పదేళ్లకాలంలో ఐదుగురు మృతి చెందడమే ఇందుకు నిదర్శనం. అలాగే నిత్యం ఏదోక సందర్భంగా ప్రమాదాలు జరుగుతున్నా కొందరు అధికారులు నిమోదు చేయకుండానే దాచిపెడుతున్నారనే ఆరోణలు వస్తున్నాయి. సింగరేణి యాజమాన్యం ప్రతి ఏడాది భద్రతా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నా అదంతా నామ్‌కే వాస్తే అని తెలుస్తోంది. వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ప్రమాదాలు

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్ కాస్టు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో సుమారు 5 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. గనుల్లో ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు తీవ్రంగా గాయాల పాలవుతున్నారు. పని ప్రదేశాల్లో సింగరేణి అధికారులు సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడం, నాణ్యత లేని రక్షణ పరికరాలు అందించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఐదేళ్లల్లో ఇవీ...

భూపాలపల్లి ఏరియాలో గడిచిన ఐదేళ్లకాలంలో సుమారు 171 ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఇద్దరు కార్మికులు మరణించారు. 173 మంది కార్మికులు గాయాల పాలయ్యారు. 2019లో 20 సీరియస్ యాక్సిడెంట్లు కాగా 20 మంది కార్మికులు గాయపడ్డారు. అలాగే 28 రిపోర్టబుల్ ప్రమాదాలు జరిగాయి. 2020లో కరోనా కాలంలో బుగ్గ ఉత్పత్తి నిలిచిపోయి గనుల్లో పనులు సరిగా జరగకపోవడంతో ప్రమాదాలు కాస్త తగ్గుమఖం పట్టాయి. దీంతో 16 సీరియస్ యాక్సిడెంట్లు, 13 రిపోర్టబుల్ ప్రమాదాలు జరిగాయి. 2021లో ఒక ఫ్యాటల్ ప్రమాదం జరగ్గా ఇద్దరు కార్మికులు మరణించారు. 20 సీరియస్ యాక్సిడెంట్స్ జర్గగ 21 మంది సింగరేణి కార్మికులు గాయపడ్డారు. 11 రిపోర్టబల్ ప్రమాదాలు జరిగాయి. 2022లో 22 సీరియస్ యాక్సిడెంటు జరగ్గా 24 మంది కార్మికులు గాయపడ్డారు. తొమ్మిది రిపోర్టబుల్ ప్రమాదాలు జరిగినట్లు అధికారులు రిపోర్టు చేశారు. 2023లో 16 సీరియస్ ప్రమా దాలు జరిగాయి. ఇందులో 16 మంది కార్మికులు గాయపడ్డారు. ఏడు రిపోర్ట బుల్ ప్రమాదాలు జరగ్గా ఏడుగురు గాయపడ్డారు. అలాగే 2024 డిసెంబరు 6 వరకు 10 సీరియస్ యాక్సిడెంట్స్ జరగ్గా 10మంది కార్మికులు గాయ పడ్డారు. ఐదు రిపోర్టబుల్ ప్రమాదాలు జరిగి, ఐదుగురు కార్మికులు స్వల్పంగా గాయపడినట్లు ఏరియా సింగరేణి అధికారులు తెలిపారు. ఇలా అధికారిక లెక్కలు చెబుతుండా రిపోర్టు రాయకుండా గోప్యంగా ఉంచిన ప్రమాదాలు చాలానే ఉంటాయని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

పదేళ్లలో ఐదు మరణాలు

భూపాలపల్లి ఏరియాలోని గనులలో గడిచిన పదేళ్లలో సుమారు 874 ప్రమాదాలు జరగ్గా ఇందులో ఐదుగురు కార్మికులు మరణించారు. 2014లో కేటీకే-1వ గనిలో ప్రమాదం జరిగి సపోర్టుమన్ ఈర్ల సర్వయ్య మృతి చెందాడు. 2016లో కేటీకే-5వ గనిలో ప్రమాదం జరిగి బండారు వెంకటేశ్ అనే ఎంజీటీ ట్రైనీ(మైనింగ్) మరణించాడు. 2018లో కేటీకే-1వ గనిలో ప్రమాదం జరిగి రాయుడు సత్యనారాయణ అనే సపోర్టుమన్ మృతి చెందాడు. 2021లో కేటీకే-6వ గనిలో జరిగిన ప్రమాదంలో సలవేణి శంకరయ్య, క్యాతం నర్సయ్య అనే సపోర్టుమన్లు మృతి చెందారు. 2021 తర్వాత ఫ్యాటల్ యాక్సిడెంట్లు జరగక పోవడం సంతోషకరంగా ఉన్నప్పటికీ పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగి కార్మికులు తీవ్ర స్థాయిలో గాయపడ్డారు. ఇందులో పలువురు కార్మికులు కళ్లు పోగొట్టుకుని, కాళ్లు విరగొట్టుకున్నవారు ఉన్నారని తెలుస్తోంది. .

దాస్తున్న అధికారులు?

బొగ్గు గనుల్లో అడపా దడపా చిన్న చిన్న ప్రమాదాలు జరగడం సర్వ సాధారణం. ప్రమాదంలో కార్మికులు గాయ పడితే గని అధికారులు రిపోర్టు రాసి, చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాల్సి ఉంటుంది. కానీ భూపాలపల్లి ఏరియాలో కొందరు సింగరేణి అధికారులు కార్మికులకు పనిస్థలాల్లో తీవ్రంగా గాయాలు అయినప్పటికీ వాటిని రిపోర్టులో రాయకుండా ట్రీట్ మెంట్ రిపోర్టు రాసి వారికి చికిత్స చేయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మరి కొందరు అధికారులైతే గాయం విషయమై ఎవరికీ చెప్పొద్దని, సర్ఫేజ్‌లో పని చేసుకునే అవకాశం కల్పిస్తామని కార్మికులను మభ్యపెడుతున్నట్లు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

తూతూమంత్రంగానే రక్షణ చర్యలు

సింగరేణి గనులు, డిపార్టుమెంట్లలో అధికారులు తూతూమంత్రంగానే రక్షణ చర్యలు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి రోజూ రక్షణ ప్రతిజ్ఞ చేయించడమే తప్ప అందుకు తగినట్లు అధికారులు నడుచు కోవడంలేదని పలువురు కార్మికులు చెబుతున్నారు. పని స్థలాల్లో ముందుగా సంబంధిత అధికారులు పరిశీలించి ఆ తర్వాత కార్మికులను పనులకు పురమాయించాల్సి ఉంటుంది. అయితే.. కొందరు అధికారులు అదేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపడితే గనుల్లో ప్రమాదాల సంఖ్య కాస్తయినా తగ్గుముఖం పడుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పేరుకే భద్రతా పక్షోత్సవాలు

సింగరేణి యాజమాన్యం ప్రతి సంవత్సరం భద్రతా పక్షోత్సవాలను నిర్వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 15 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా జీఎం స్థాయి అధికారుల బృందం వచ్చి తనిఖీలు నిర్వహించి వెళ్లిపోతారు. అప్పటి వరకు ఏరియా సింగరేణి అధికారులు గనులు, డిపార్టుమెంట్లలో సూచిక బోర్డులు, రక్షణకు సంబంధించిన కొటేషన్లు రాసి, జెండాలు కట్టి హంగూ ఆర్బాటాలతోనే సరిపెట్టుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సింగరేణి పూల్‌లో జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిలచిన ఈ పోటీలకు జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపో టములు సహజమన్నారు. గెలిచిన వారు అంతటితో ఆగకుండా ఉన్నత స్థాయికి వెళ్లే వరకు కృషి చేయాలని అన్నారు. అలాగే ఓటమి చెందిన నిరుత్సాహానికి గురికాకుండా మళ్లీ ప్రయత్నం చేయాలని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలలో వర్షిత్, సచిన్ సాత్విక్, హమీద్, ఇషాన్, నాదేడ్ల అథితి, జోహన్న, శైజు, అబినయ, జాహ్నవి తదితరులు విజేతలుగా నిలిచారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

కాళేశ్వరంలో జనసేన నాయకుడి పూజలు



కాళేశ్వర ఆలయంలోజనసేన ఇన్‌చార్జి శంకర్‌గౌడ్

మహదేవపూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర పుణ్యక్షేత్రాన్ని జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ కుటుంబ సమేతంగా సందర్శించారు. స్వామి వారి దర్శనం అనంతరం శుభానందదేవి ఆలయంలో అర్చకులు శేష వస్త్రాలతో ఆయన్ను సన్మానించారు. ఆయనవెంట జర్రిపోతుల సతన్, కాల్వ రాజశేఖర్, మహ్మద్, రాజేష్, అవినాష్, రవికాంత్, రాకేష్, సుమన్, రాజు ప్రశాంత్ ఉన్నారు.

12 వాహనాల సీజ్

మహదేవపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైఔన పత్రాలు, ఇన్సూరెన్స్ లేకపోవడంతో 12 ద్విచక్ర వాహనాలకు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

వంతెనపై చెట్లను తొలగించిన పోలీసులు



చెట్లను తొలగిస్తున్న పోలీసులు

మల్హర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల సరిహద్దులోని పీవీ నగర్ వంతెనపై విరిగి పడిన చెట్లను కొయ్యూర్ పోలీసులు ఆదివారం తొలగించారు. మూడు చెట్లు విరిగి బ్రిడ్జిపై పడటంతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కొయ్యూర్ పోలీసులు అక్కడికి చేరుకొని చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై నరేష్, కానిస్టేబుల్స్ సుధాకర్, సాగర్, నరేష్, హోమ్‌గార్డు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌లో హార్వెస్టర్ దగ్ధం

వెంకటాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి హార్వెస్టర్ దగ్ధమైన సంఘటన మండలంలోని లింగాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. లింగాపూర్ గ్రామంలోని శ్రీనివాస్‌కు చెందిన హార్వెస్టర్ మధ్యాహ్నం సమయంలో పొలంలో వడ్లు పడుతుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై కిందికి దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సంఘటన ప్రాంతంలో నీటి వసతి లేకపోవడంతో హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కాటారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పవన్, రాజేశ్వర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. రైతులు తాము పండించిన పంటలను కాపాడుకోవడానికి తయారు చేసిన క్రాప్ ప్రొటెక్ట్ రెయిన్ గేజ్ అలారం ప్రథమ బహుమతి సాధించి రాష్ట స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రతినిధులు వెంకటేశ్, సుజారాణి, సైన్స్ టీచర్లు గణపతి, రోహిత్ తెలిపారు.

నేటి నుంచే 'ఇందిరమ్మ' సర్వే

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ సోమవారం నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. జిల్లాలోని 241 గ్రామాలతోపాటు భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో సర్వే చేయనున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మునిసిపల్ వార్డుల్లో అధికారులు ఈ ప్రక్రియను చేపట్ట ను న్నారు. పంచాయతీ కార్యదర్శులులేని గ్రామాల్లో జూనియర్ అసిస్టెంట్లతో సర్వే చేయించనున్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా

ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సర్వేను అధికారులు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా చేయనున్నారు. జిల్లాలో 1.23 లక్షలకు పైచిలుకు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. వీటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు, మునిసిపల్ వార్డుల్లో అధికారులు దరఖాస్తుదారుల వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదుచేయనున్నారు. ఇప్పటికే సర్వే చేసే సిబ్బందికి అధికారులు యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం కూడా ఇచ్చారు.

క్షేత్రస్థాయిలో సర్వే చేసిన వివరాలను సిబ్బంది యాప్‌లో నమోదు చేయనున్నారు. సర్వేలో నమోదైన వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన లబ్ధిదారులను గుర్తించనున్నారు. అధికారులు గుర్తించిన లబ్ధిదారులపై ఆరోపణలు తలెత్తితే విచారణ జరిపి నిజమైన లబ్ధిదా రులను గుర్తించే అధికారం ప్రభుత్వం కలెక్టర్‌కు కట్టబెట్టింది.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం

ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

శాయంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విజయోత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. వసంతాపూర్ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యం, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక హామీల అమలుపై చిత్తశుద్ధి చూప డం లేదని అన్నారు. ఏడాదిలో ఏం ఒరగబెట్టారని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. పథకాల ఆర్భాటాలు తప్ప అమలు లేవని ఎద్దేవా చేశారు. యువత, రైతులు, మహిళలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చకుంటే మూల్యం తప్పదని హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హంస రెడ్డి, నీల రవీందర్, గ డ్డం నాగార్జున, సావిత్రి, రాజిరెడ్డి, మహ్మద్ ఉస్మాన్ రమేష్, కిసాన్, బుచ్చయ్య, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ.. ఇష్టారీతి



గోదావరి నదిలోనే ఏర్పాటు చేసి వేబ్రిడ్జి



వేబ్రిడ్జి నుంచి ఇసుక లారీల కోసం ఒడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబట్‌పల్లి-2 క్వారీ సమీపంలో గోదావరి నది ఒడ్డును ఇష్టారీతిన తవ్వేస్తున్నారు. స్టాక్‌యార్డుకు దారిపేరుతో విధ్వంసం సృష్టిస్తూ ఒడ్డులను పూర్తిగా తోడేస్తున్నారు. అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకుండా ముసుగు వేసి తమపని తాము కానిస్తున్నారు. ఆరు నెలల క్రితం అంబట్‌పల్లి-2 ఇసుక క్వారీకి టెండరు దక్కించుకున్న నిర్వాహకులు ఇప్పటికే సుమా రు సగానికిపై డంపింగ్ పూర్తి చేసుకోగా టీజీఎండీసీ ద్వారా అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

అయితే గతంలో డంపింగ్ కోసం వేసిన దారి ఉండగా మరో రెండు దార్లు సృష్టించారు. ఈదారుల కోసం ఇష్టారీతిన గోదావరి ఒడ్డును తవ్వేశారు. ఇది చాలదన్నట్టు ఏకంగా గోదావరి నదిలోనే వేబ్రిడ్జి ఏర్పాటు చేశారు. దాని పైనుంచి క్వారీకి సంబంధించిన లారీలు వెళ్లేందుకు వీలుగా మరో రెండు చోట్ల గోదావరి ఒడ్డును ధ్వంసం చేశారు. పైగా సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే వేబ్రిడ్జిని ఏర్పాటు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంట్రాక్టర్లు తమ స్వలాభం కోసం గోదావరి ఒడ్డును ఇష్టారీతిన తవ్వేస్తే వానాకాలంలో గోదావరి ఒడ్డు మరింత కోతకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఒడ్డు కోతకు గురవుతుండగా ఈ దుశ్చర్యలతో మరింత కోతకు గురయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతా ధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలనే సర్వత్రా డిమాండ్ వస్తోంది.

న్యూస్ రీల్

ఐలాపూర్ జాతరకు నిధులు కేటాయించాలి: ఆదివాసీ విద్యార్థి నేత రవి



తల్లులను దర్శించుకుంటున్న రవి

కన్నాయిగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐలాపూర్ సమ్మక్క, సారలమ్మ జాతరకు ప్రభుత్వం రూ. కోటి కేటాయించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఐలాపూర్ సమ్మక్క, సారలమ్మలను దర్శిం చుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఐలాపూర్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కట్టించిన పెంకుటిల్లు తప్పితే మరేం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట మేడారం డైరెక్టర్ పొడెం శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సజ్జన సాంగత్యంతో జ్ఞానం

- పిరమిడ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కట్టా కళాధర్‌రెడ్డి



మాట్లాడుతున్న కళాధర్‌రెడ్డి

కాటారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సజ్జన సాంగత్యంతో ధ్యానిగా, జ్ఞానిగా మారొచ్చని పిరమిడ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, హిమా లయ యోగి కట్టా కళాధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో పిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటీ మూవ్ మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ధ్యాన, విజ్ఞాన బోధన తరగతులు జరిగాయి. సొసైటీ, సేవాదళ్ అధ్యక్షుడు అనంతుల రమేష్ బాబు, రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాధర్‌రెడ్డి హాజరయ్యారు. ప్రతి మనిషి ధ్యానంతో బహుళ ప్రయో జనాలు పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ ప్రసాద్, పలువురు ధ్యానయోగులు, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగిన సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లాకేంద్రంలోని పోస్టాఫీస్ సమీపంలో చేపట్టిన సమ్మె మూడోరోజు ఆదివారం కొనసాగింది. ఈసందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఈనెల 9వతేదీలోపు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే 10వతేదీ నుంచి నిరవధిక సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 20సంవత్సరాలుగా అతి తక్కువ వేతనంతో శ్రమదోపిడీకి గురవుతున్న తమను రెగ్యులర్ చేసి పేస్కేల్ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కాగా, సమ్మెలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, క్లస్టర్ పాఠశాలల సిబ్బంది పాల్గొని మద్దతు తెలిపారు. ఈసమ్మెలో జేఏసీ ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాద్య కుమార్, జిల్లా అసోసియేట్ సభ్యులు ఫిరోజ్, నాంపల్లి చిరంజీవి, ప్రవీణ్, రమేష్, సుబ్బారెడ్డి, అనిత, తిరుమల, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలు, ఐఆర్పీలు, పీటీఐలు, మెసెంజర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

తాడ్వాయి, (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా జేఏసీ నాయకుడు నీలంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆదివారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకుముందు సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. తక్షణమే వారిని రెగ్యులర్‌చేసి పేస్కేల్ అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనవెంట సీఆర్పీలు కళ్యాణి, రవికుమార్, వసంతరావు, నరేష్, కంప్యూటర్ ఆపరేటర్ సారయ్య, మెసెంజర్ రమేష్, పీటీఐ స్వామి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలకు నిరసనగా బీజేపీ ర్యాలీ



కాటారంలో బీజేపీ ర్యాలీ

కాటారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది ప్రజా పాలనను నిరసిస్తూ బీజేపీ నాయకులు ఆదివారం బైక్ ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయకపోవడం, ఇతర హామీలను నెరవేర్చక పోవడంపై బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ప్రదర్శనను నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఇది జరగ్గా బీజేపీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేత చల్లా నారాయణరెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పూసాల రాజేంద్రప్రసాద్, దుర్గం తిరుపతి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, జిల్లెల్ల శ్రీశైలం, పాగె రంజిత్‌కుమార్, మంత్రి సునీల్, రాజు, వీరారెడ్డి, తిరుపతి, రవి, అర్జయ్య, అశోక్‌రెడ్డి, రవీంద్రాచారి. స్వామియాదవ్, కోటయ్య, మధు, బాపురెడ్డి, వేణు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు అంబాల అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బీసీ హాస్టల్‌లో ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు ఆశ్రయం పొందుతున్నారని, వీరికి తాగునీటి సమస్య ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో వేడినీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సమస్యలను తాత్కాలికంగా పరిష్కారం చూపించినా భవిష్యత్‌లో అవి మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

అయ్యప్ప దీక్షాపరులకు వస్త్ర వర్తక సంఘం అన్నదానం

కాటారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాప రులకు వస్త్ర వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం జరిగింది. సంఘం ప్రతినిధులు అలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి దీక్షాపరులకు భోజనం వడ్డించారు. 2025 జనవరి 15 వరకు జరిగే నిత్యాన్నదానానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు బచ్చు అశోక్, బచ్చు ప్రకాష్, పీచర రామ కృష్ణారావు, జక్కు మొగిళి, రంజిత్ కుమార్, చీమల రాజు, తెప్పల శ్రీనివాస్ కోరారు.

బురదజల్లితే ప్రజలు నమ్మరు

మల్హర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబుపై బురదజల్లితే ప్రజలు నమ్మరని, ఇప్పటికైనా ఆ ప్రయత్నం మానుకోవాలని కాం గ్రెస్ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల సమయంలో వేల కోట్ల రూపా యలు వెనకేసుకున్న పుట్ట మధు ఓడి పోవడాన్ని జీర్ణిం చుకోలేక పిచ్చి పట్టినట్లు వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటంతో తట్టుకోలేక పోతున్నారని వ్యాఖ్యానించారు.

బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయం

వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



వినయ్ భాస్కర్‌ను సన్మానిస్తున్న హరీశ్‌రెడ్డి

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపునకు కృషి చేస్తున్న బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయమని వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్ కొనియాడారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆదివారం నిర్వహించిన బ్రహ్మకుమారీస్ నూతన భవన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ద్వారా మానసిక ప్రశాంతతను పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంస నీయమన్నారు. ప్రజాసేవలో నిరంతరాయంగా కొనసాగుతున్న నాయకులు, ప్రజా ప్రతినిధులకు బ్రహ్మకుమారీస్ చెప్పే సూక్తులు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం ఆనందదాయకమన్నారు. తనవంతు కూడా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్త హరిబాబు, నాయకులు మందల విద్యాసాగర్‌రెడ్డి, జాగృతి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్టు

చెరువు కట్టకు గండి

కాటారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చెరువులను రిజర్వాయర్లుగా పునరుద్ధరించే ప్రక్రియ వేగంగా సాగుతోంది. మండలంలోని శివశంకర్ ప్రాజెక్టు చెరువు కట్టకు ఆదివారం నిర్మాణ సంస్థ సిబ్బంది గండి కొట్టారు. దీంతో వేలాది క్యూసెక్కుల నీరు చెరువు కింది పొలాలు, వాగులవైపు తరలిపోయింది. కాగా చెరువు కట్టకు గండి కొట్టే సమయంలో అందరికీ హెచ్చరికలు జారీ చేసి పనులు చేయాల్సి ఉండగా కొందరికి మాత్రమే విషయం తెలిసింది. దీంతో చెరువు కింద పొలాల్లో గొర్రెల మందలు పెడుతున్న క్రమంలో నీటి వరద ఒక్కసారిగా రావడంతో గొర్రె పిల్లలను కాపాడుకోవడానికి పెంపకందారులు నీళ్లలోంచి వెళ్లి వాటిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు.



చెరువు కట్టకు తీసిన గండి నుంచి వెళ్తున్న నీరు